# తెలంగాణ గొంతుక కేసీఆర్

- ఆయన సెంచరీ కొట్టాలంటే ఇల్లెందులో హరిప్రియ గెలవాలి
- 11 సార్లు అవకాశం ఇచ్చినా కాంగ్రెస్ ఏమీ చేయలేదు
- అందుకే ఆ పార్టీని మరోసారి నమ్మి మోసపోవద్దు
- తెగువ గల తెలంగాణ బిడ్డ.. నా చెల్లెలు హరిప్రియ
- ఖమ్మం జిల్లాలో సింహభాగం సీట్లు సాధించాలి
- ఇల్లెందు రోడ్‌షోలో మంత్రి, బీఆర్‌ఎస్ నేత కేటీఆర్



ఇల్లెందు పట్టణం రోడ్‌షోలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న మంత్రి కేటీఆర్, పక్కన బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియ

ఇల్లెందు, నవంబర్ 19 : తెలంగాణకు ఉన్న ఒకే ఒక్క గొంతుక సీఎం, ఉద్యమ నేత కేసీఆర్ అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆయన సారథ్యంలోనే తెలంగాణ సిద్ధించిందని, ఆయన పాలనలోనే అద్భుత ప్రగతి సాధించిందని స్పష్టం చేశారు. ఆయన నాయకత్వంలో ఈసారి కూడా ప్రభుత్వ ఏర్పాటు తథ్యమని తేల్చిచెప్పారు. ఆయన సెంచరీ కొట్టి వంద సీట్లు సాధించాలంటే ఇక్కడ హరిప్రియ గెలవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అందుకోసం ఆమెకు ఇక్కడి ప్రజలు అధిక మెజార్టీ అందించాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఇల్లెందుకు వచ్చిన ఆయన.. పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్‌కు 11 సార్లు అవకాశం ఇస్తే ప్రజలకు ఆ పార్టీ ఏమీ చేయలేకపోయిందని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ ఏమరపాటుగా ఆ పార్టీకి మరోసారి అవకాశం ఇస్తే పంటికి అంటకుండానే మనల్ని మింగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకని ఈ ఎన్నికల వేల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## 24 గంటల కరెంటు ఎందుకివ్వలేదు..

రాష్ట్రాన్ని 55 ఏళ్లపాటు పాలించిన కాంగ్రెస్.. తమ పాలనలో 24 గంటల కరెంట్, తాగునీరు, సాగునీరు ఎందుకు ఇవ్వలేదని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి పథకాలను ఎందుకు అమలు చేయలేదని, పోడు పట్టాలుగానీ, సింగరేణి కార్మికులకు 34 శాతం బోనస్‌గానీ ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్కాములు చేయడం, రాష్ట్రాన్ని మింగడమే కాంగ్రెస్ విధానమని దుయ్యబట్టారు. కానీ అదే సమయంలో ఇవన్నీ ఇచ్చిన సీఎం కేసీఆర్‌ను చిన్న చిన్న కారణాలతో వదులుకోవద్దని కోరారు. తెలంగాణ ప్రజల కోసం పేగులు తెగే దాకా కొట్లాడిన కేసీఆర్‌ను మరవొద్దని విజ్ఞప్తి చేశారు. ఎప్పటికైనా మనవాళ్లు మనవాళ్లే, పరాయివాళ్లు పరాయివాళ్లే అవుతారని అన్నారు. తెలంగాణపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమ.. రాహుల్‌గాంధీకిగానీ, నరేంద్రమోదీకిగానీ ఇసుమంతైనా ఉండదని అన్నారు. ప్రజలు దయచేసి ఈ విషయాన్ని గమనించాలని కోరారు. సింగరేణిని ప్రైవేటుపరం చేస్తామని ప్రధాని మోదీ అంటుంటే రాహుల్‌గాంధీ ఎందుకు మట్లాడలేదని నిలదీశారు. కానీ అదే సమయంలో సింగరేణిని ప్రైవేట్‌పరం చేయెుద్దంటూ మళ్లీ కేసీఆరే కొట్లాడారని గుర్తుచేశారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయకుండా మోదీ కాలయాపన చేసినా కాంగ్రెస్ ఎందుకు మాట్లాడడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెండుసార్లు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా ఇల్లెందులో ప్రతిపక్షమే గెలిచిందని అన్నారు. కానీ ఈసారి ఇక్కడ పరిస్థితి మారిందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈసారి సింహభాగం సీట్లు కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఏర్పాటులో ఇల్లెందు పాత్ర కీలకమని సీఎం అంటున్నారని, అది జరగాలంటే ఈ నెల 30న ఇల్లెందులో హరిప్రియ అత్యధిక మెజార్టీతో గెలవాలని అన్నారు. ఇక్కడి ప్రజల ఉత్సాహం, ఊపు చూస్తుంటే వంద శాతం గెలుస్తారని అనిపిస్తోందని అన్నారు. అలాగే, డిసెంబర్ 3 తర్వాత గెలిచేది బీఆర్ఎస్ పార్టీనే అని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మ్యానిఫెస్టోను అమలు చేస్తామని అన్నారు. ఏజెన్సీలోని గిరిజనేతరుల పోడు భూములకు పట్టాలివ్వడానికి కేంద్రం మోకాలడ్డుతోందని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల తర్వాత మోదీని పక్కకు జరిపి అవి కూడా సాధిస్తామని అన్నారు. ఇంకా మిగిలి ఉన్న కొన్ని పోడు పట్టాలను ఇస్తామని, కొత్త రేషన్ కార్డులు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. హరిప్రియకు ఆరోగ్య సమస్యలున్నా, ఓ బిడ్డకు జన్మనిచ్చినా సమ్మక్క, సారక్క మాదిరిగా అంతటి తెగువతో నియోజకవర్గ అభివృద్ధి కోసం కొట్లాడిందని గుర్తుచేశారు. పట్టణ అభివృద్ధి కోసం కూడా తన చెల్లెలు హరిప్రియ తనతో కొట్లాడి మరీ నిధులు తెచ్చి ఈ ప్రాంత రూపురేఖలను మార్చిందని వివరించారు. ఈ ప్రాంత రైతుల సీతారామ ప్రాజెక్టును సాధించిందని అన్నారు. ఆ ఎత్తిపోతల పథకాన్ని కూడా త్వరలోనే పూర్తి చేసి గోదావరి నీళ్లతో ఇక్కడి రైతుల కాళ్లు కడుగుతామని అన్నారు. ఇక్కడ కొన్ని అలకలు, అసంతృప్తులు ఉన్నాయని, అయినా వాటికి ఇది సమయం కాదని, తెల్లారి హరిప్రియతో అభివృద్ధి పనులు చేయించుకోవాలని సూచించారు.



బోనాలతో కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలు



మంత్రి కేటీఆర్ ప్రసంగాన్ని వింటున్న ప్రజలు

## కేసీఆర్, కేటీఆర్ సహకారంతోనే ఇంతటి అభివృద్ధి: హరిప్రియ

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతోనే నియోజకవర్గంలో ఇంతటి అభివృద్ధి చేయగలిగానని బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ పేర్కొన్నారు. బస్ డిపో, 100 బెడ్ల ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రం, వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, మల్టీ యుటిలిటీ సెంటర్, మోడల్ మార్కెట్, ప్రధాన రహదారి, సీతారామ ప్రాజెక్టు వంటివన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. ప్రజలు కోరుకుంటున్న కొమరారం, బోడు మండలాలను ఏర్పాటు చేయాలని, ఇల్లెందును రెవెన్యూ డివిజన్ చేయాలని, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఇతర ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, ఆంగోత్ బిందు, ఊకే అబ్బయ్య, మడత వెంకట్‌గౌడ్, జానీపాషా, ప్రవీణ్‌నాయక్, ఎస్.రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. న్నారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు..

గార్ల మండలానికి చెందిన లక్కినేని సుధీర్, ఇల్లెందుకు చెందిన డాక్టర్ భాస్కర్‌నాయక్ తదితరులు మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాగా, మంత్రి కేటీఆర్ రోడ్ షో సందర్భంగా ఇల్లెందు పట్టణం జనసంద్రమైంది.

# కాంగ్రెస్ హస్తం.. దారిద్ర్యానికి నేస్తం..

- 2014 తర్వాత జరిగిన అభివృద్ధిని చూడండి
- ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల బీమా వర్తింపజేస్తాం
- అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులిస్తాం
- కేసీఆర్‌దే హవా.. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- ఆయిల్‌పాం రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తాం
- అశ్వారావుపేట రోడ్ షోలో మంత్రి కేటీఆర్

అశ్వారావుపేట, నవంబర్ 19 : కాంగ్రెస్ హస్తం.. దారిద్రానికి నేస్తమని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ పార్టీ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. 2014 తర్వాత తెలంగాణలో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించేందుకు ఆదివారం అశ్వారావుపేటకు వచ్చిన ఆయన పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే ఆయా పార్టీలు తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తామో చెప్పుకుంటాయని, అప్పటికే అధికారంలో ఉన్న పార్టీలైతే అప్పటికే తాము ఏం చేశాయో, మరోసారి గెలిస్తే ఇంకేం చేయబోతామో చెప్పుకుంటాయని అన్నారు. కానీ కొన్ని పార్టీలు మాత్రం డబ్బులతో మనలను కొనేందుకు వస్తున్నాయని అన్నారు. ఆ పార్టీలన్నీ ధనాన్ని నమ్ముకుంటే.. బీఆర్ఎస్ మాత్రం జనాన్ని నమ్ముకుందని స్పష్టం చేశారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ మూడోసారి ఏర్పాటు కాబోతున్న బీఆర్ఎస్ ప్రభుత్వంలో సన్నబియ్యం అందిస్తామని, రైతుబీమా తరహాలోనే ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల బీమాను వర్తింపజేస్తామని అన్నారు. డిసెంబర్ 3 తర్వాత రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములున్న ప్రతి రైతుకూ ఆ భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తామని అన్నారు. అలాగే, పామాయిల్ రైతులకు కూడా కనీస మద్దతు ధర ఇస్తామని అన్నారు. కాంగ్రెస్ విధానం కొత్త సీసాలో పాత సారా లాంటిదేనని, కొత్తదనం ఏమీ లేదని ఎద్దేవా చేశారు. 2014కు ముందు కనీసం కరెంట్ లేక, నీళ్లు లేక ఎలా అల్లాడిపోయామో, ఎరువులు, విత్తనాల కోసం రైతులు ఎంతలా పడిగాపులు కాశారో ప్రజలందరికీ గుర్తేనని అన్నారు. అందుకని మరో అవకాశమంటూ అడుగుతున్న కాంగ్రెస్‌ను నమ్మవద్దని సూచించారు. గడచిన 55 ఏళ్లలో 11 సార్లు ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశమిచ్చినా ప్రజలకు ఆ పార్టీ చేసిందేమీ లేదని మండిపడ్డారు. కాంగ్రెసోళ్లు కరెంట్ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ పాలనంతా కాలిపోయిన మోటర్ల, పేలిపోయిన ట్రాన్స‌ఫార్మర్లు, అర్ధరాత్రి ఆగమమైన రైతుల బతుకు లేనని దుయ్యబట్టారు. మూడు గంటల విద్యుత్ చాలని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని కాంగ్రెసోళ్లు ఉచిత సలహాలిస్తుండడం వారి అజ్ఞానానికి నిదర్శనమని అన్నారు.

## పామాయిల్ విస్తరణ సామర్థ్యం పెంచుతాం..

పామాయిల్ సాగు విస్తరణతో ఫ్యాక్టరీల సామర్థ్యం కూడా పెంచుకుంటున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. ఉద్యాన నర్సరీలకు కూడా ఉచితంగా విద్యుత్ అందిస్తామన్నారు. ప్రజలందరూ ఓటు వేసేటప్పుడు పని చేసిన ప్రభుత్వాన్ని, పని చేసే పార్టీని చూడాలని కోరారు. ఒకరికి కత్తి ఇచ్చి మరొకరిని యుద్ధం చేయమంటే ప్రయోజనం ఉండదని అన్నారు. ఈ కత్తిని 'మెచ్చా'కు ఇచ్చి ఆయననే యుద్ధం చేయమంటేనే తగిన ఫలితం ఉంటుందని అన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే మెచ్చా చేసిన అభివృద్ధి ఇక్కడి ప్రజల కళ్ల ముందే కనిపిస్తోందని అన్నారు. అందుకని మరోసారి కూడా ఆయనను గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్‌దే హవా అని, హ్యాట్రిక్ సాధించేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్‌ది సోషల్ మీడియాలో కేవలం బిల్డప్ మాత్రమేనని దుయ్యబట్టారు. అనంతరం అశ్వారావుపేట మేజర్ పంచాయతీ పాలకవర్గ సభ్యుడు లక్ష్మణరావు మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.



రోడ్ షోకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు

## అభివృద్ధి చేశా.. ఆదరించండి: ఎమ్మెల్యే మెచ్చా

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆదరించాలని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ సహకారంతో రూ.800 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని అన్నారు. అశ్వారావుపేటలో బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా అందించాలని కోరారు.

## అశ్వారావుపేటపై వరాల జల్లు..

అశ్వారావుపేట నియోజకవర్గంపై మంత్రి కేటీఆర్ వరాల జల్లు కురిపించారు. అశ్వారావుపేట పట్టణాన్ని డిసెంబర్ 3 తర్వాత ఏర్పాటు కాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సిపాలిటీని చేస్తానని ప్రకటించారు. అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం, దమ్మపేట మండలం పట్వారీగూడెం గ్రామాలను కొత్త మండలాలుగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దమ్మపేట 10 బెడ్ల ఆసుపత్రిని 30 బెడ్ల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మంజూరు చేస్తామని మాట ఇచ్చారు. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణ, ఇతర ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు రావు జోగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, చిన్నంశెట్టి వరలక్ష్మి, సున్నం నాగమణి, జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బానోతు పద్మావతి, భూక్యా ప్రసాదరావు, వగ్గెల పూజ, డీకేఎం మహిపాల్, కోటగిరి సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.